బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలిని కలిసిన నాయకులు

రామాయంపేట, ఆగస్టు 6: బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని రామాయంపేట నాయకులు హైదరాబాద్‌లోని ఆమె స్వగృహంలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, పట్టణాధ్యక్షుడు నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం, రమేశ్ మంగళవారం కలిశారు.

గుడిసె దగ్ధం

చిలిపిచెడ్, ఆగస్టు 6: విద్యుత్ షార్ట్ సర్యూట్‌తో గుడిసె దగ్ధమై, నిత్యావసరాలు, వస్తువులు కాలి బూడిదైన ఘటన చిలిపిచెడ్ మండలంలోని సోమక్కపేటలో మంగళవారం జరిగింది. బాధితురాలు పద్మ, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్యూట్‌తో పూరి గుడిసె దగ్ధమైంది. దీంతో డబ్బులు, పట్టా పాస్ బుక్‌లు, వంట సామగ్రి, బట్టలు, బియ్యం పూర్తిగా కాలిపోయాయి. తమ కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి: ఏబీవీపీ

రామాయంపేట, ఆగస్టు 6: ప్రభుత్వం వెంటనే స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రామాయంపేట జాతీయ రహదారిపై నాయకులు ధర్నా, రాస్తారోకో చేశారు. డీఈవో, ఎంఈవో పోస్టుల భర్తీతో పాటు మెగా డీఎస్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ధర్నాలో సంపత్, ప్రణయ్, దీక్షిత్, సతీశ్, అశ్విత్, అభిషేక్, భరత్, దేవదాసు పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

రామాయంపేట, ఆగస్టు 6: అదుపుతప్పి కారు బోల్తా పడిన ఘటన రామాయంపేట మండలంలోని దామరచెర్వు గ్రామ శివారులో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాయాంపేట నుంచి భిక్కనూరు మండలం మల్లుపల్లి గ్రామానికి కారు వెళ్తున్నది. ప్రమాదవశాత్తు అదుపుతప్పి కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారికి తృటిలో ప్రాణాపాయం తప్పింది. విషయం తెలుసుకున్న దామర చెర్వు గ్రామస్తులు ఘటనా స్థలానికి వెళ్లి కారును పైకి తీశారు.

కరాటే మాస్టర్‌కు సన్మానం

నిజాంపేట, ఆగస్టు 6: జాతీయస్థాయిలో నిర్వహించిన కరాటే పోటీల్లో నిజాంపేటకు చెందిన 24 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పథకాలు సాధించారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇచ్చిన మాస్టర్ సంపత్‌కుమార్‌ను ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, చల్మెటి నరేందర్ అభినందించి, సన్మానించారు.

ఘనంగా మున్సిపల్ చైర్మన్ పుట్టినరోజు వేడుకలు

నర్సాపూర్,ఆగస్టు 6: ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ పుట్టిన రోజు వేడుకలు మంగళవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్‌కు ఎమ్మెల్యే కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

చేగుంట/శివ్వంపేట, ఆగస్టు 6: చేగుంట మండలంలోని ఆయా గ్రామాల్లోని 21 మంది బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను బీజేపీ నాయకులు మంగళవారం అందజేశారు. శివ్వంపేట మండలం ఏదుల్లాపూర్‌లో ఇద్దరికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ ఎంపీపీ హరికృష్ణ అందజేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WATER PROOFING

★ Roof & Wall Crack Filling, Water Proofing Coatings, New & Old Bhathrooms Leakages, Water Tank & Sump Leakages, Rain Coat & Pest Control, Slab & Beems Injection Work, 10 years Waranty. Call: 9010425273, 8121425273.
NT-326124

WANTED

★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-325783-All

★ మెదక్ జిల్లాలో పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు/గార్డ్స్ కావలెను. నెలకు జీతం: 21,000/17,000. ESI, PF సౌకర్యం కలదు. అర్హత: డిగ్రీ/టెన్త్, వయస్సు: 20-40 సం॥ లోపు, ఎత్తు: 5.6", మంచి అనుభవం కలవారు కావలెను. అన్ని వసతులు కలిగిన ఉచిత బ్యాచిలర్ రూమ్ కలదు. సెల్ నెం: 8341038715, 9848328701, 8919606707.
NT-98111

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మెదక్ మున్సిపాలిటీ: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జయశంకర్ సార్ చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకుల నివాళులు

వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ సార్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎస్సై రాజు, సిబ్బంది

నర్సాపూర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, సిబ్బంది



కౌడిపల్లి: ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

సారుకు ఘన నివాళి

- తెలంగాణ సాధనే శ్వాసగా జీవితాన్ని అంకితం చేసిన మహా మనిషి జయశంకర్ సార్
- రాష్ట్ర అవశ్యకతను సామాన్య భాషలో తెలిపిన మహనీయుడు
- ఘనంగా నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

అల్లాదుర్గంలో జయశంకర్ సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేగుంట మండల కేంద్రంలో జయశంకర్ జయంతి, రామలింగారెడ్డి వర్ధంతిని నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తెలంగాణ సిద్ధాంతకర్త, రాష్ట్ర సాధనే శ్వాసగా జీవితాన్ని అంకితం చేసిన మహా మనిషి జయశంకర్ సార్. తెలంగాణ అవశ్యకతను సామాన్య భాషలో చెప్పిన మహనీయుడు. ఆయన చూపిన మార్గంలోనే ప్రతిఒక్కరూ నడుచుకోవాలి అని సారు సేవలను జిల్లా వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు కొనియాడారు. జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం బీఆర్ఎస్ కార్యాలయాలు, ఊరూ వాడాల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నిజాంపేటలో దళిత సంఘాల ఆధ్వర్యంలో గద్దర్, జయశంకర్ సార్ జయంతిని నిర్వహించారు.

– మెదక్ మున్సిపాలిటీ/నిజాంపేట/ వెల్దుర్తి/నర్సాపూర్/చిన్నశంకరంపేట/కౌడిపల్లి/అల్లాదుర్గం, ఆగస్టు 6:

నిజాంపేటలో గద్దర్, జయశంకర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దళిత సంఘం సభ్యులు

మొక్కలు నాటి సంరక్షించాలి

నర్సాపూర్: తుల్జారాంపేట గ్రామంలో మొక్క నాటి, నీరు పోస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

చేగుంట: చెట్లతిమ్మాయిపల్లిలో పరిసరాలను పరిశీలిస్తున్న పీఆర్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, జడ్పీ సీఈవో

కౌడిపల్లి: స్వచ్ఛదనం– పచ్చదనంలో పాల్గొని మొక్కలు నాటుతున్న డీఎల్‌పీవో సాయిబాబా, తదితరులు

నర్సాపూర్/వెల్దుర్తి/రామాయంపేట/అల్లాదుర్గం/ చేగుంట/ చిలిపిచెడ్/మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 6: మొక్కలు నాటి, వాటిని సంరక్షించడం ప్రతిఒక్కరి బాధ్యతని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. నర్సాపూర్ మండలంలోని తుల్జారాంపేట్, మాడాపూర్, గూడెంగడ్డ గ్రామాల్లో నిర్వహించిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురియాలంటే మొక్కలు పెంచాలన్నారు. గ్రామాల్లో పచ్చదనంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలఅన్నారు. జిల్లా వ్యాప్తంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల్లోని పరిసరాలను పరిశీలించి, మొక్కలు నాటారు.

- పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి
- విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి
- స్వచ్ఛదనం-పచ్చదనం లక్ష్యంగా కృషి చేయాలి
- పట్టణాలు.పల్లెలు పచ్చదనంతో కళ కళ లాడాలి
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

అల్లాదుర్గం: టేక్మాల్ మండలంలోని చౌడమ్మకుంట కట్టపై మొక్క నాటుతున్న డీఎల్పీవో సురేశ్‌బాబు

రామాయంపేట ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడుతున్న చైర్మన్ చైర్మన్ జితేందర్‌గౌడ్

మెదక్ మున్సిపాలిటీ: తాగు నీటిలో క్లోరినేషన్ లెవెల్స్‌ను టెస్టింగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

తల్లిపాలు పిల్లలకు అమృతం లాంటివి

చేగుంట: నార్సింగిలో సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న జిల్లా డిప్యూటీ వైద్యాధికారి జ్ఞానేశ్వర్

చిలిపిచెడ్: బద్రియ తండాలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ సంతోషిమాత

మెదక్ మున్సిపాలిటీ: తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న గర్భిణులు, బాలింతలు

మెదక్ మున్సిపాలిటీ/చిలిపిచెడ్/అల్లాదుర్గం/చేగుంట, ఆగస్టు 6: తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటింవి. పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలి. దీంతో రోగ నిరోధక శక్తి వస్తుంది. పౌష్టికహారం తీసుకుంటే శిశువు ఆరోగ్యంగా ఉంటారు. ప్రభుత్వ దవాఖానల్లోనే ప్రసవాలు చేసుకోవాలని అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు, జాగ్రత్తలు సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళ వారం అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు.

- గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి
- చిన్నారులకు పోషక విలువలున్న ఆహారాన్ని అందించాలి
- జిల్లా డిప్యూటీ వైద్యాధికారి జ్ఞానేశ్వర్

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

- అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి

అల్లాదుర్గం, ఆగస్టు 6: మండలంలోని గడిపెద్దాపూర్‌లో ఈనెల 4న జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రేణుకా రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సీఐ మాట్లాడుతూ ముస్లాపూర్ గ్రామానికి చెందిన దాదయ్య జూన్ 22న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి భార్యకు అదే గ్రామానికి చెందిన చిత్తారి బేతయ్యతో వివాహేతర సంబంధం ఉండడంతో దాదయ్య మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు బేతయ్యతో గొడవపడ్డారు. బేతయ్య గ్రామం వదిలిపెట్టి గడిపెద్దాపూర్‌లో నివాసం ఉంటూ గొర్లు మేపుతూ జీవిస్తున్నాడు. బేతయ్యపై కక్ష పెంచుకున్న దాదయ్య కుటుంబ సభ్యుడు పోచయ్య అతడిని అంతమొందించాలని భావించాడు. అదను కోసం ఎదురు చూశాడు. ఈ నెల 4న బేతయ్యతో పాటు మల్లేశం గొర్లు మేపుతున్నాడు. గడిపెద్దాపూర్ శివారులో బేతయ్య తనతో ఉన్నాడని మల్లేశం ఫోన్ ద్వారా పోచయ్యకు సమాచారం అందించాడు. ఇదే సరైన సమయం అని భావించిన పోచయ్య వెంటనే అతడు ఉన్న ప్రదేశానికి చేరుకుని, మల్లేశంతో పాటుఉ మరికొంత మందితో కలిసి బేతయ్యను గొడ్డలితో నరికి హత్య చేశాడు. హత్యకు సహకరించిన మరో నలుగురు నిందితులు రాజు, సిద్ధయ్య, రమేశ్, అంబయ్యను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు నేరాన్ని అంగీకరించినట్లు సీఐ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎస్సై ప్రవీణ్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఎక్కువ ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు: డీఏవో

కౌడిపల్లి, ఆగస్టు 6: ఎరువులు అధిక ధరలకు అమ్మితే వారిపై పీడీయాక్టు కింద కేసులు నమోదు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో డివిజన్‌లోని ఎరువుల దుకాణం యజమానులతో సమావేశం నిర్వహించారు. ఏఈవోలు స్వప్నాజాదవ్, ఝాన్సి, శ్వేతకుమారి, బాల్‌రెడ్డి ఉన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

రామాయంపేట, ఆగస్టు 6: అర్హులైనవారు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని డీఏవో గోవింద్ తెలిపారు. రామాయంపేటకు విచ్చేసిన ఆయన గ్రీవెన్స్ సెల్‌ను సందర్శించి, బీమా చేసుకున్న రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. జూన్ 28వ తేదీ లోపు పట్టా పాస్ బుక్ పొందిన రైతులంతా రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 7వ తేదీ వరకు సమయం కేటాయించినట్లు తెలిపారు. ఆయనతో మండల వ్యవసాయశాఖ అధికారి రాజ్‌నారాయణ ఉన్నారు.

మాత గట్టమ్మ విగ్రహం ఊరేగింపు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 6: పట్టణంలోని కోలిగడ్డలో నిర్మించిన గట్టమ్మ ఆలయంలో ప్రతిష్టించనున్న మాత విగ్రహాన్ని మంగళవారం బోరంచమ్మ ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..

- మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

నందిగామలో బాధిత కుటుంబీకులకు సాయం మందిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

నిజాంపేట, ఆగస్టు 6: బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లి మృత్యువాత పడ్డ నందిగామకు చెందిన బాబు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మంగళవారం పరామర్శించారు. సొంత నిధుల నుంచి రూ.1.25 లక్షల ఆర్థిక సాయం అందజేశారు. దీంతో పాటు కల్వకుంటలో వివిధ కారణాలతో మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించి, వారి పిల్లల పేరిట ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పు న ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఆయనతో ఎంపీడీవో రాజిరెడ్డి, మండల ప్రత్యేకాధికారి గోవింద్, మాజీ ఎంపీపీ సిద్ధిరాములు, మాజీ సర్పంచులు అమరసేనారెడ్డి, నర్సింహారెడ్డి, బాలయ్య ఉన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు 8 మంది ఎంపిక

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 6: తెలంగాణ స్టేట్ మెన్ అండ్ ఉమెన్ అండర్-23 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు మంగళవారం జిల్లాస్థాయి ఎంపికలను స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మధుసూదన్ తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పది కి.మీ విభాగం పరుగు పందెంలో కేతావత్ అర్జున్, 5 కి.మీ పరుగు పందెంలో మునేందర్‌బాబు, మోహన్, 800 మీటర్ల పరుగు పందెంలో శేఖర్, 400 మీటర్ల పరుగు పందెంలో వినోద్, 200 మీటర్ల పరుగు పందెంలో ఆమన్, 100 మీటర్ల పరుగు పందెంలో అనీశ్, ఆమన్, షాట్‌పుట్‌లో కళ్యాణ్ ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 17, 18వ తేదీల్లో ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ ఎంపికల్లో అథ్లెటిక్స్ కోచ్‌లు పృథ్వీ, మౌలానా, చంటి తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కులు కల్పించాలని రైతుల ధర్నా

రామాయంపేట, ఆగస్టు 6: తమ భూములపై హక్కులు కల్పించాలని, 50 ఏండ్లుగా కాస్తులో ఉన్నామని, అయినా న్యాయం జరగడం లేదని 25 మంది రైతులు తహసీల్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేశారు. పట్టణ శివారులోని 1547 సర్వే నెంబర్‌లోని 98 ఎకరాల్లో సాగులో ఉన్నామని వారు తెలిపారు. భూ హక్కులు లేవంటూ అధికారులు జీవోలు తయారు చేస్తున్నారన్నారు. తమ భూములకు రైతుబంధు రావడం లేదని, బ్యాంకుల్లో రుణాలు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పొరంబోకు భూములుగా చూపడం సరికాదని వాపోయారు. తహసీల్ కార్యాలయం ఎదుట గంట పాటు ఆందోళన చేసి, తహసీల్దార్ రజినీకుమారికి వినతి పత్రం అందజేశారు.

చరిత్రపై విస్తృత పరిశోధనలు జరగాలి

-అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 6: చరిత్రపై విద్యార్థులకు జిజ్ఞాస కలిగించడానికి పరిశోధకుల సేవలు అవసరమని అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ క్యాంపస్‌లో చరిత్ర విభాగం, టార్చ్ సంయుక్తంగా రాష్ట్రస్థాయి ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ చరిత్రను వెలుగులోకి తీసుకురావడానికి టార్చ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. తెలంగాణ చరిత్ర పూర్తిస్థాయిలో అధ్యయనం చేయడానికి అందుబాటులో లేదని పరిశోధకులు సునీల్ సముద్రాల అన్నారు. చరిత్ర, సంస్కృతి, శిలాశాసనాలు, తామ్ర శాసనాలతో తెలుసుకోవచ్చని ప్రముఖ పురాజీవ శాస్త్ర పరిశోధకుడు అరవింద్ ఆర్య అన్నారు. చరిత్ర, సంస్కృతి, కళలు, వారసత్వ సంపద విద్యార్థుల మనోవికసానికి ఎంతో దోహదపడుతుందని కాట్రగడ్డ హిమాన్సి అన్నారు. ప్రిన్సిపాల్ హుస్సేన్, అధ్యాపకులు తిరుమల్ రెడ్డి, సురేందర్‌రావు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు యూనివర్శిటీ పేరు మార్చొద్దు

మెదక్ మున్సిపాలిటీ/రామాయంపేట, ఆగస్టు 6: హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయానికి ఉన్న పొట్టి శ్రీరాములు పేరును తొలిగించడం పద్ధతి కాదని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి తెలిపారు. పొట్టి శ్రీరాములు యూనివర్శిటీ పేరు మార్చొద్దని జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు మేడిశెట్టి శంకర్ మంగళవారం కోరారు. సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతున్నదని, ప్రభుత్వానికి అలాంటి ఆలోచన ఉంటే విరమించుకోవాలన్నారు. దశాబ్దాల కాలంగా తెలుగు విశ్వ విద్యాలయం పొట్టి శ్రీరాములు పేరుతో నడుస్తున్నదని, పేరును ప్రభుత్వం తొలిగించడం భావ్యం కాదన్నారు.

మెదక్ కోర్టులో ప్రత్యేక లోక్ అదాలత్

మెదక్ అర్బన్, ఆగస్టు 6: జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ లక్ష్మీశారద అధ్యక్షతన జిల్లా కోర్టులో మంగళవారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్‌అదాలత్‌తో శివ్వంపేట మండలం ఉసిరికపల్లి గ్రామానికి చెందిన వారు, మెదక్‌లో ఒక ఎకరా 8 గుంటలకు సంబంధించి ఇరు పక్షాల వారిని రాజీ కుదుర్చుకున్నారు.ఈ కేసుకు సంబంధించి న్యాయవాదులు బాల్య, విజయ్‌గౌడ్, బెంచ్ సభ్యులు దుర్గారెడ్డి పాల్గొన్నారు.

తూప్రాన్‌లో భారీగా రేషన్ బియ్యం పట్టివేత

తూప్రాన్, ఆగస్టు 6: తూప్రాన్ పట్టణంలో మంగళవారం 292 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ సాధిక్ సిబ్బందితో కలిసి తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని అల్లాపూర్ టోల్ ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించారు. మేడ్చల్ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న 292 క్వింటాళ్ల బియ్యం లోడుతో వెళ్తున్న లారీ (సీజీ 08 ఏకేఎల్ 5236) పట్టుబడింది. ఈ లారీని, రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి సేఫ్ కస్టడీకి తీసుకున్నారు. లారీని నవదుర్గా పారా బాయిల్డ్ రైస్‌మిల్లుకు తరలించారు. సివిల్ సప్లై డీటీ సాధిక్ ఫిర్యాదు మేరకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న డ్రైవర్ మనీశ్ కుమార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తూప్రాన్ ఎస్సై శివానందం తెలిపారు.